క్లుప్తంగా

వినతి పత్రం అందజేత



కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ జాగృతి అధ్యక్షుడు మురళి కృష్ణ తదితరులు

కాచిగూడ: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎక్స్‌రోడ్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మహాత్మ జ్యోతిరావూ పూలే విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీ కృష్ణ తెలిపారు.

8,9 తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: ఈ నెల 8,9 తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదికను సికింద్రాబాద్‌లోని అమృత వాణి కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.అబ్రహం తెలిపారు. ఆసక్తి గల వివిధ కులాల వధూవరుల తల్లిదండ్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 8885410555, 8885073555 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సివిల్స్ పరీక్ష అభ్యర్థులకు 9న ఉచిత వర్క్‌షాప్

చిక్కడపల్లి: డాక్టర్ ఎస్ శ్రీధర్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 9న ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ నాగ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌లోని అకాడమీలో ఆదివారం జరిగే ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ విద్యావేత్త, పోటీ పరీక్షనిపుణులు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఇతర నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 8374938606 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలని 10న చలో ఇందిరాపార్క్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో నిలిచిపోయిన ఉపాధ్యాయ దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలని, 18 నెలల ఎదురు చూపునకు ముగింపు పలకాలని ఈ నెల 10వ తేదీన చలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి ఉపాధ్యాయ దంపతులు పిలుపునిచ్చారు. ఈ నెల 10న ఇందిరాపార్క్ వేదికగా, ఉపాధ్యాయ దంపతులు, వారి పిల్లలు తల్లిదండ్రులతో ఈ ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పౌజ్ ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వివేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారాణాల వల్ల 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీలు నిలిచి పోయాయన్నారు. స్పౌజ్ బదిలీలు జరగక భర్త ఒక జిల్లాలో భార్య మరోక జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ గడిచిన 18 నెలలుగా ఉపాధ్యాయ కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నాయన్నారు. తమ బదిలీలు జరిపించాలని ప్రభుత్వానికి నిరంతరాయంగా విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చినట్లు వివేక్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పనిని రజక సొసైటీకి ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం జీవో నెంబర్ 102 ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని రజక సంక్షేమ సమితి రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ కొండూరు సత్యనారాయణ తెలిపారు. గురువారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చేతులమీదుగా జీవో కాపీని తీసుకున్నారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయమన్నారు.

గురుసత్కారం

నల్లకుంట: గురు పౌర్ణమిని పురస్కరించుకొని శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలో గల శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో గురువారం సాయంత్రం గురుసత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మకు గురు సత్కారం చేశారు.

విక్రమ్‌నగర్ బస్తీ అభివృద్ధికి సహకారం

కాచిగూడ: విక్రమ్‌నగర్ బస్తీ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. విక్రంనగర్ యూత్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని గురువారం ఎమ్మెల్యే అభినందించారు. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.నరేష్, ప్రధాన కార్యదర్శి ఓ.విజయ్ కుమార్, కోశాధికారి బి.కిషోర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణ కాలనీ పార్కు అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



కృష్ణ కాలనీ పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: కృష్ణ కాలనీ పార్కు స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోకి కృష్ణ కాలనీ పార్కును రూ.15 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ కాలనీ పార్కు స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి కాపాడుకునేందుకు స్థానికులు పెద్ద పోరాటం చేసి స్థలాన్ని రక్షించుకున్నారు అన్నారు. ఈ పార్కులో ఓపెన్ జిమ్, పాత్‌వే, గ్రిల్ నిర్మాణం, పచ్చదనం, బెంచీల ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అతిసుందరమైన పార్కుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఇందిరాపార్కు, సుందరయ్య పార్కు, వైఎస్ఆర్ పార్కులను అభివృద్ధి పరిచామన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



నర్సింహబస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జలమండలి, జీహెచ్ఎంసీలోని ఆయా విభాగాల అధికారును హెచ్చరించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని ఆయా బస్తీలలో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శంకర్‌మఠ్ మార్కెట్ రోడ్డులో పారిశుద్ధ్య సిబ్బంది వీధులు సరిగా శుభ్రం చేయడంలేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే శానిటేషన్ అధికారులతో మాట్లాడి నిత్యం రద్దీగా ఉండే వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అంతకు ముందు నర్సింహబస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడ కొనసాగుతున్న సీవరేజీ పైప్ లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు ఎం.భూపతినాథ్, కార్యదర్శి శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, గాలపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనాలు నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న మోజెస్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్‌లో గల భగత్‌సింగ్‌నగర్, పాలమూరు బస్తీలలో సామాజిక భవనాలు నిర్మించాలని కోరుతూ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు మల్లేష్, లింగయ్య, మధు, శ్రీనివాస్, సతీష్, రాములమ్మ, బీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా పైపులైన్ల ఆధునికీకరణ



మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ పనులను ఆధునీకీకరించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, సివరేజ్ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ ఏర్పాటుతో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్‌లోని హైదరాబాద్ స్టడీ సర్కిల్ సమీపంలో రూ.25 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ పనులకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ జి.రచనశ్రీలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పూల్‌బాగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు రాబోయే 20 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

అక్షర సముద్రంలో ఇనాక్ సాహిత్య పర్వతం

చిక్కడపల్లి : అక్షర సముద్రంలో ఇనాక్ సాహిత్యం పర్వతంలా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్రగ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం రాత్రి శ్రీ త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో గానసభ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా ఆయన రచించిన పోలి కథానిక సంపుటిని శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ ఇనాక్ సాహిత్య ప్రక్రియలన్నీ వేదన ఆవేదనలోంచి వచ్చినవెనన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నలేశ్వరం శంకరం మాట్లాడుతూ దళిత ఉద్యమానికి సాహిత్యంలో తొలిబాటలు వేసిన ఇనాక్ తాను దళితుడిని అన్న ఆత్మన్యూనతా భావం వద్దు అంటారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

కాచిగూడ: గుర్తుతెలియని మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని గురువారం డబీర్‌పుర - యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్యన పట్టాల పక్కన చెట్ల పొదల్లో రైల్వే పోలీసులు గుర్తించారు. పట్టాలు దాటుతుండగా అతన్ని రైలు ఢీకొని మృతి చెందినట్లు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రాజకీయాలు నిర్వహిస్తున్నారని ఎంసీపీఐ జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ విమర్శించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతూ దోపిడీ వర్గాలతో సీపీఐ, సీపీఎం పొత్తులు ఉండడం వల్ల మనువాదం బలపడుతుందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రానున్న సాధారణ ఎన్నికల్లో లబ్ధి కోసం అప్రజాస్వామిక పద్ధతిలో విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఎంసీపీఐ నాయకులు వనం సుధాకర్, తాండ్ర కళావతి, తుకారామ్‌నాయక్ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

అంబర్‌పేట: ఆసుపత్రిలో ఉన్న భర్తను చూసేందుకు వెళ్లిన గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... బాగ్‌అంబర్‌పేట బతుకమ్మ కుంటలో నివసించే వాగ్య, తారమ్మ(55)లు దంపతులు కాగా వాగ్య కంటిచూపుతో బాధపడుతూ. ఆపరేషన్ కోసం మెహిదీపట్నం సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో చేరారు. అతడిని చూడడానికి తారమ్మ ఈ నెల 1వ తేదీన ఇంట్లో నుంచి ఆసుపత్రికి వెళ్లింది. అప్పటి నుంచి తారమ్మ ఇంటికి తిరిగి రాలేదు, ఆసుపత్రిలో లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఆయా ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలి

నల్లకుంట: నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. అదే సమయంలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజలకు పరిశుద్ధమైన తాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గురువారం నల్లకుంట డివిజన్ కళావతి లైన్‌లో రూ. 13 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న వాటర్ పైప్ లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. అంబర్‌పేట నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాజకీయాలకతీతంగా అన్ని బస్తీలు, కాలనీలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే అన్ని బస్తీలు, కాలనీలలో దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణతో పాటు ఆయా ప్రాంతాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, టీఆర్ఎస్, బీజేపీ నాయకులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి ఘన సత్కారం



కాచిగూడ: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితులైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం బర్కత్‌పుర లోని బీజేపీ నగర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆయనను పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కన్నె రమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ్, బాల ప్రసాద్, సూరి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా నవభారత లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ లయన్ గోపాల కృష్ణ, క్లబ్ అధ్యక్షుడు లయన్ వినయ్, ఉపాధ్యక్షులు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కార్యదర్శి పి.స్వరూపారాణి, వంశీ ఆయనను గురువారం కలిసి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.

మంచినీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంటలోని కూరగాయల మార్కెట్ సమీపంలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్, ఆదర్శ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీజీఎం మోహన్‌రాజుకు వినతిపత్రం సమర్పించారు. నల్లకుంట కూరగాయల మార్కెట్ మూన్ కేఫ్ వద్ద జరుగుతున్న నాలా పనుల వల్ల మంచినీటి పైపులైన్‌లు పగిలి నీరు లీకేజీ అవుతుందని మూడు నెలల గడుస్తున్నా మరమ్మత్తులు చేపట్టడం లేదని దీంతో పాటు నాలా, రోడ్డు పనులు ఆగిపోయాయని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ నాయకులు డి.మోహన్‌నాయుడు, వీరయ్య, పి.వెంకటస్వామిగౌడ్, శ్రీనివాస్‌రావు, రమణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు ముందుగానే చెక్కులివ్వాలి

చిక్కడపల్లి: ఆషాడమాసంలో వైభవంగా జరుపుకునే అమ్మవారి బోనాల జాతరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రతి ఏడాది అన్ని దేవాలయాల కమిటీలకు అందించే నిధుల చెక్కులను పండుగకు ముందుగానే దేవాలయాలకు అందించాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణకు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కార్యాలయంలో కలసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎక్కువ శాతం దేవాలయాలకు పండుగ తరువాత చెక్కులు అందుతున్నాయని ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు వేంటనే మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఓ 58 ప్రకారం ఇళ్లపట్టాలివ్వాలి



ధర్నాలో పాల్గొన్న ప్రజలు, కార్మికుల, నాయకులు

కవాడిగూడ: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు జీవో 58 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రతి ప్రకటన జీవోగా భావించాలని, వాగ్దానాలను అమలు చేసినప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుందని, మాట తప్పితే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో 1432 మురికివాడలు ఉన్నాయని, మరో 450 వరకు ఉంటాయని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పుతున్న ప్రభుత్వం మురికివాడలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, దళితులకు మూడు ఎకరాల భూమిని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు జరిగేలా కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగేలా మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం గోల్నాకలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావాల్సిన మౌళిక వసతులు కల్పించేలా చొరవ తీసుకుంటానన్నారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు భూపతి లక్ష్మణ్, రాము, రాజేష్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఆవిర్భావం

అంబర్‌పేట: పద్మశాలి సంఘం అంబర్‌పేట నియోజకవర్గం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గురువారం గోల్నాకలో జరిగిన సమావేశంలో సంఘం నియోజకవర్గం అధ్యక్షులు వి.కృష్ణ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షులుగా ఎ.అంజయ్య, జి.సత్తయ్య, కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చిలుక శివకుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా జి.వెంకటరమణ, టి.నరేందర్, సంయుక్త కార్యదర్శులుగా బి.వెంకటయ్య, జి.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, కోశాధికారిగా బి.అశోక్‌కుమార్, ప్రధాన సలహాదారులుగా డాక్టర్ మార్త రమేష్, పుట్ట పాండు రంగయ్య, నక్క రమేష్, డాక్టర్ జీవి.రాజు, న్యాయ సలహాదారులుగా ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్యలు నియమితులయ్యారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వివరించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ మందడి అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ పార్టీ నూతన అధ్యక్షుడుగా నియమితులైన పోతరాజు భాస్కర్ గురువారం మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అరాచక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కొత్త డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ముషీరాబాద్ ఏ-బ్లాక్ అధ్యక్షులు వీడీ కృష్ణ, కాంగ్రెస్ నగర నాయకులు పి.లక్ష్మణ్, మద్దెల ప్రభాకర్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం




జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎర్ర భీష్మ దేవ్



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

కాచిగూడ: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యారావు, లక్ష్మణ్, శ్రవణ్, అనంతరాజ్, రాజు, శివ, గణేష్, మురారి తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పూలమాలవేసి గురువారం ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు రత్న సాయిచంద్, నగర యువ నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం గోల్నాక చౌరస్తాలో జరిగిన బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పులిజాల గెల్వయ్య, బాబు పాల్గొన్నారు.

బంగారు బోనం బ్రోచర్ ఆవిష్కరణ



కాచిగూడ: బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న లాల్‌దర్వాజ మహంకాళీ అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తున్నట్లు మహిళా సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు ఆలే భవ్య తెలిపారు. బంగారు బోనం బ్రోచర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి గురువారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆవిష్కరించారు. 14న జరిగే బంగారు బోనం సమర్పణ వేడుకలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు ముఖ్యఅతిధులుగా హాజరవుతారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీసీ రక్షక్ దళ్ చైర్మన్ ఉదయ్ నేత, రాకేష్ పాల్గొన్నారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

లక్డీకాపూల్: అలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 21వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవార్డును ఉత్తమ సంగీత, సాహిత్య, గాన, కళ, సేవా, ఉపాధ్యాయ, నటీ నటులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులకు, జర్నలిస్టులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ఈ నెల 20లోపు 94948 61669కు వాట్సాప్ ద్వారా తమ వివరాలు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సామాజిక కార్యకర్తలు, సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, కళాకారులు, కవులు తమ తమ సంక్షిప్త వివరాలతో కూడిన దరఖాస్తులను ఉత్తమ అవార్డు ప్రదానోత్సవం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో వచ్చే నెల1వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ నూకల వెంకట సుభ భర్త కీ॥శే॥ నూకల సోమ శేఖర్‌రావు వయస్సు: 65 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసము: ఇం.నెం.1-19-79/13/202, సాయి సంకీర్తి రెసిడెన్సీ, అయోధ్య నగర్, ఎ.ఎస్. రావునగర్, ఇ.సి.ఐ.యల్., సికింద్రాబాద్ - 500062 హైదరాబాద్ జిల్లా, చిక్కడపల్లి మండలములో గల వివేక్‌నగర్ కాలనీలోగల పీపుల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన ప్లాట్ నెం.32, ఇంటి నెం. 1-1-336/90, వార్డు నెం.1, బ్లాక్ నెం.1లో గల 296 గజాలు (247.45 చ.మీ)లు గల ఆస్తికి (ఇంటికి) నా క్లయింటు సంపూర్ణ యజమాని, ఈమె వివేకనగర్ నుండి చిక్కడపల్లికి తేది: 01.07.2023న ప్రయాణించుచుండగా ఆమె యొక్క ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2087/1967ని పోగొట్టుకున్నది. మరియు దానిని చాలా వెతికినా దొరకలేదు.

అందువలన పైన తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికిన వ్యక్తి/వ్యక్తులు పైన తెలిపిన నా క్లయింట్‌కు లేదా నాకు సదరు డాక్యుమెంట్స్ అందజేయవలసిందిగా కోరడమైనది.

సం/- డి. నరేష్ B.Com., LLB, అడ్వకేట్
11-116, సాహితినగర్, గంగా థియేటర్ దగ్గర,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500060.
ఫోన్: 24065191 (ఆ), సెల్: 9440401364